TELANGANA CAPITAL

# తెలంగాణ క్యాపిటల్

నిజం.. నిజాయితీ.. నిబద్ధత

TELANGANA CAPITAL NEWS

www.telanganacapitalnews.com

హైదరాబాద్ సంపుటి : 1 సంచిక: 37 శుక్రవారం, మే 17, 2024 కంప్లిమెంటరీ కాపీ పేజీలు : 4



## ముందే రానున్న నైరుతి

# రుతుపవనాలు

### మే31న కేరళను తాకనున్న తొలకరి ఐఎండి ప్రకటనతో అన్నదాతల్లో ఆనందం

హైదరాబాద్,: మూడేళ్లుగా తీవ్ర వర్షాభావ పరిస్థితులతో అల్లాడుతున్న రైతన్నలకు వాతావరణశాఖ శుభవార్త అందజేసింది. ఈ ఏడాది జూన్ కన్నా ముందుగానే నైరుతి రుతుపవనాలు కేరళను తాకే అవకాశం ఉంది. మే 31నే నైరుతి రుతుపవనాలు రానున్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది..వాతావరణశాఖ అంచనాల ప్రకారం ఈ ఏడాది సాధారణం కన్నా ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నట్లు తెలిపింది. రుతుపవనాల సీజన్‌లో 106 శాతం వర్షపాతం నమోదు కావచ్చని అంచనా వేసింది. ఆగస్టు- సెప్టెంబరు నాటికి ఎక్కువ వర్షపాతం నమోదు కావచ్చని వెల్లడించింది. వాయవ్య, తూర్పు, ఈశాన్య రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాలు మినహా దేశంలోని చాలా ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ పేర్కొంది. గతేడాది నైరుతి రుతుపవనాలు రాక ఆలస్యం కావడంతోపాటు..దేశంలోనూ వివిధ ప్రాంతాలకు ఆలస్యంగా విస్తరించడంతో తొలకరి జల్లుల కోసం రైతులు కళ్లు కాయలు కాసే వరకు ఎదురు చూశారు.

2వ పేజీలో...

హైదరాబాద్, : హైదరాబాద్‌లో కురుస్తున్న వర్షాలపై అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్ రెడ్డిఅధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం సచివాలయంలోని అన్ని విభాగాల అధికారులతో సీఎం మాట్లాడారు. వర్షాల నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఎప్పటికప్పుడు సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. వర్షాలపై సచివాలయంలో వివిధ శాఖల ముఖ్య అధికారులతో రేవంత్ రివ్యూ నిర్వహిస్తున్నారు. ఈ సమావేశానికి మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఉన్నతాధికారులు హాజరయ్యారు. సీఎం రేవంత్ సెక్రటేరియట్‌లో నిర్వహిస్తున్న సమావేశంలో రాష్ట్రానికి వివిధ మార్గాల్లో వచ్చే ఆదాయంపై అధికారులతో చర్చిస్తున్నారు. వాణిజ్య పన్ను, రవాణా, ఎక్సైజ్, రిజిస్ట్రేషన్, స్టాంప్స్, మైనింగ్ శాఖల్లో ఆదాయ రాబడి వివరాలపై సీఎం ఆరా తీస్తున్నారు. ప్రభుత్వ పథకాల అమలు కోసం నిధుల సేకరణపై రేవంత్ సర్కార్ దృష్టిపెట్టింది. ఇందులో భాగంగా ఆదాయవనరులను అన్వేషిస్తోంది.



# వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి

## అధికారులకు సిఎం రేవంత్ ఆదేశాలు



2వ పేజీలో...

## తెలంగాణలో పలుచోట్ల

# భారీ వర్షాలు

### నగరంలో ఉరుములతో దంచికొట్టిన వాన ఆదురుగగాలుతో పలుచోట్ల విద్యుత్ అంతరాయం

హైదరాబాద్, : తెలంగాణలోని పలుచోట్ల భారీ వర్షాలు కురిసాయి. హైదరాబాద్ నగరంలో కుండపోత వర్షం కురిసింది. గురువారం సాయంత్రం హైదరాబాద్‌లో భారీ వర్షంతో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. గచ్చిబౌలి, కూకట్‌పల్లి, నిజాంపేట్, హైదర్‌నగర్, బాచుపల్లి, బోయిన్‌పల్లి, మారేడుపల్లి, బేగంపేట్, ప్యారడైజ్, చిలకలగూడ, అల్వాల్, జవహర్‌నగర్, మల్కాజిగిరి, నేరేడ్‌మెట్, నాగారం, కుత్బుల్లాపూర్, చింతల్, షాపూర్‌నగర్, గాజులరామారం, సూరారం, బహదూర్‌పల్లి, షేక్‌పేట, రాయదుర్గం, పంజాగుట్ట, బోరబండ, రెహమత్‌నగర్, ఉప్పల్ తదితర ప్రాంతాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షం కురుస్తోంది. రోడ్లపైకి వర్షపు నీరు చేరడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.నగరంలోని పలు ప్రాంతాల్లో కుండపోత వర్షం కురుస్తోంది.



## రైతుల కోసం బిఆర్ఎస్ ధర్నాలు

# సిగ్గుచేటు

### గతంలో కాల్పులు జరిపి...బేడీలు వేసింది వారు రైతులను ఏనాడూ ఆదుకోని కెసిఆర్ రైతుల పక్షాన కాంగ్రెస్ ఆదుకుంటుంది ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి వెల్లడి

నిజామాబాద్, : రైతుల కోసం బీఆర్ఎస్ ధర్నాలు చేయడం సిగ్గు చేటని కాంగ్రెస్ ఎమ్మెల్సీ,నిజామాబాద్ ఎంపి అబ్యర్థి జీవన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గతం కంటే అదనంగా ధాన్యం కొనుగోళ్లు కేంద్రాలు తెరిచి కొనుగోళ్లు చేస్తున్నామని ఎమ్మెల్సీ తెలిపారు. అలాగే జిల్లాల్లో ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని, తడిసిన ధాన్యం కూడా కొనాలసని సిఎం ఇప్పటికే ఆదేశాలు ఇచ్చారని అన్నారు. ఈ క్రమంలో బిఆర్ఎస్ ధర్నాలు చేయడం రాజకీయం తప్ప మరోటి కాదన్నారు. సీఎం రేవంత్ రైతు సంక్షేమ సర్కార్ నడిపిస్తున్నారన్నారు. బీఆర్ఎస్ నేతలు సిగ్గు, లజ్జా లేకుండా ధర్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. త్వరలోనే రైతులకు సీఎం రేవంత్ తీపికబురు చెబుతారని అన్నారు. రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చినా... సీఎం రేవంత్ సమర్థవంతంగా పాలన సాగిస్తున్నారన్నారు. కేసీఆర్ లాగా రైతుల విషయంలో మోసం చేసే సర్కార్ తమది కాదన్నారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. గత పదేళ్లల్లో రైతులకు ఏం చేశారని ప్రశ్నించారు. రైతులకు సంకెళు వేసింది బీఆర్ఎస్ కాదా అని నిలదీశారు. గతంలో బేడీలు వేశారని.. నేరెళ్ల ఘటన ఎవరి హయాంలో జరిగిందని అన్నారు. రైతులను బీఆర్ఎస్ ప్రభుత్వం గోసపుచ్చుకుందని.. దాన్ని ఎవరు మర్చిపోలేదన్నారు. వరి వేస్తే ఉరి అని కేసీఆర్ అన్నారని గుర్తుచేశారు. రైతులను వరి సాగు చెయ్యొద్దని చెప్పి కేసీఆర్ తన ఫామ్ హౌస్‌లో వరి వేయలేదా అని నిలదీశారు. ధర్నాల పేరుతో రైతులను మరోసారి మోసం చేసే పనిలో పడ్డారని మండిపడ్డారు. యావత్ దేశంలోనే రైతుల ఆత్మహత్యలో రాష్ట్రాన్ని రెండో స్థానానికి తీసుకొచ్చిందే కేసీఆర్ అని దుయ్యబట్టారు. రాష్ట్రంలో కాంగ్రెస్ హవా నడుస్తోందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ డబుల్ డిజిట్ స్థానాలు దక్కించు కుంటుందని ధీమా వ్యక్తం చేశారు. పదేళ్ల పాలన చేసిన మోదీ సెంటిమెంట్‌పైనే ఓట్లు అడుగుతున్నారని వ్యాఖ్యలు చేశారు.

# రుణమాఫీ పథకం విధివిధానాలపై కసరత్తు

### ఖరీఫ్ నుండి అమలు అయ్యే పంటల భీమా పథకం అమలుపై రైతులు, రైతు సంఘాలతో చర్చలు- అధికారులతో సమీక్షించిన మంత్రి తుమ్మల




హైదరాబాద్, : రుణమాఫీ పథకం విధివిధానాలపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులతో చర్చించారు. ఖరీఫ్ 2024 నుండి అమలు అయ్యే పంటల భీమా విధివిధానాలపై దిశా నిర్దేశం చేశారు. టెండర్లలో పేర్కొనే నిబంధనలు, ముందుకు వచ్చే కంపెనీలకు ఉన్న అర్హతలు.. మున్నగునవన్నీ ఒకటికి రెండు సార్లు పరిశీలించుకొని, రైతులు పంటనష్టపోయిన సందర్భంలో ఈ భీమా పథకం వారిని ఆదుకొనే విధంగా ఉండాలని మంత్రి తెలిపారు. పథక అమలుకు ఆదర్శ రైతులు, రైతు సంఘాల ప్రతినిధులతో ఉమ్మడి జిల్లా ప్రాతిప దికన సమావేశాలు నిర్వహించి వారి అభిప్రాయాలను కూడా పరిగణలోనికి తీసుకోవాల్సిందిగా సూచించారు. మరోవైపు.. పచ్చిరొట్ట విత్తనాలను సబ్సిడీపై సరఫరాకు విధివిధానాల రూపకల్పన చేశారు. వెంటనే సరఫరా ప్రారంభించి, సరఫరాలో ఎక్కడా లోటుపాట్లు లేకుండా చూడగలరని టీఎస్ సీడ్స్ అధికారులకు దిశానిర్ధేశం చేశారు. మొదటి విడత పంటనష్ట పరిహారం రూ.15 కోట్లు పంపిణీ పూర్తయినందున, రెండోవిడత ఏప్రిల్ మాసములో, మూడోవిడత మే మాసములో జరిగిన పంట నష్ట వివరాల సమర్పణకు ఆదేశాలు ఇచ్చారు. ఇదిలా ఉంటే.. మట్టి నమూనా పరీక్షా కేంద్రాల సామార్థ్యం అనుసరించి, వెంటనే రైతుల విజ్ఞప్తి మేరకు అవసరమున్న రైతుల పొలాల మట్టి నమూనాలు సేకరించి ఫలితాలు వచ్చే నెలాఖరులోగా అందచేసేటందుకు ప్రణాళిక చేసుకోవల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. వరి కొయ్యలు కాల్చకుండా యుద్ధప్రాతిపదికన రైతులకు అవగాహన కల్పించడం, అప్పటికీ వినకపోతే సంబం ధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ, వరికొయ్యలు తగల పెడితే జరిమానాలు విధించాల్సిందిగా మంత్రి ఆదేశాలు ఇచ్చారు. మార్క్ ఫెడ్ ద్వారా మొక్కజొన్న, జొన్న, పొద్దుతిరు గుడు కొనుగోళ్ళను వేగవంతం చేసి ఈ నెలాఖరులోగా పూర్తి చేసేవిధంగా ఆదేశాలు ఇచ్చారు. మరోవైపు.. ఉద్యానశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ కేటాయించిన భూములలో ఆధునిక సాంకేతికతతో పండ్లతోటల పెంపు మరియు నిర్వహణ బాధ్యతలు తీసుకొనే విధంగా ఆదేశాలు జారీ చేశారు.



2వ పేజీలో...

# 18వ కేబినెట్ భేటీ

హైదరాబాద్,: జూన్ 2వ తేదీ నాటికి తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేండ్లు పూర్తవుతున్న నేపథ్యంలో పునర్విభజనకు సంబంధించి రెండు రాష్ట్రాల మధ్య అపరిష్కృతంగా ఉన్న అంశాలపై ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. రాష్ట్ర విభజన అనంతరం ఉద్యోగుల కేటాయింపు మొదలుకొని ఆస్తులు, అప్పుల పంపిణీకి సంబంధించిన పెండింగ్ అంశాలపై నివేదిక తయారు చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. షెడ్యూలు 9, షెడ్యూలు 10 లో ఉన్న సంస్థలు, కార్పొరేషన్లకు సంబంధించిన పంపిణీ ఇంకా పూర్తి కాలేదు. పలు అంశాలపై రెండు రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం కుదరలేదు.



## ఎపి ప్రభుత్వ తీరుపై

# సుప్రీం ఆగ్రహం

## ఎపిలో ఇసుక అక్రమ తవ్వకాలు

2వ పేజీలో...

## ఎన్జీటీ ఆదేశాలకు విరుద్ధంగా

# చర్యలు

### ఇసుక అక్రమ తవ్వకాల నిరోధానికి కమిటీ తదుపరి విచారణ జూలై 15కు వాయిదా

న్యూఢిల్లీ, : ఏపీలో అక్రమ ఇసుక తవ్వకాలపై సుప్రీం ఆగ్రహం వ్యక్తం చేసింది. సుప్రీం ఆదేశాలను సైతం పట్టించుకోకుండా యథేచ్ఛగా అక్రమ ఇసుక తవ్వకాలను సాగించిన ఏపీ ప్రభుత్వంపై సుప్రీం ధర్మాసనం మండిపడింది. అక్రమ ఇసుక తవ్వకాలను నిలిపివేయడానికి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని ఏపీ ప్రభుత్వానికి సుప్రీం ఆదేశాలు జారీ చేసింది. కమిటీలో కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధి కారులను కూడా నియమించాలని సుప్రీం ధర్మాసనం ఆదేశించింది. నాలుగు రోజుల్లోపు అక్రమ ఇసుక రీచ్‌లను సందర్శించి వాటిని నిలిపివేయడానికి తగిన చర్యలను తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది.

# తెలంగాణలో పలుచోట్ల భారీ వర్షాలు



ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఏకధాటిగా బలమైన ఈదురు గాలులతో కూడిన వర్షానికి భారీ వృక్షాలు నేలకూలాయి. వర్షానికి జనజీవనం స్థంభించింది. పలు చోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మంచిర్యాల, భూపాలపల్లి, ములుగు, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, వికారాబాద్, మెదక్, వనపర్తి, నారాయణపేట, గద్వాల జిల్లాల్లోనూ వర్షం కురుస్తోంది. జీహెచ్ఎంసీ పరిధిలోని మణికొండ, పుప్పాలగూడ, నార్సింగి, కోకాపేట్,

మొదటిపేజీ తరువాయి...

హిమాయత్ నగర్, బండ్లగూడ తదితర ప్రాంతాల్లో చిరుజల్లులు మొదలయ్యాయి. మరోవైపు, వచ్చే 5 రోజులపాటు రాష్ట్రంలోని పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. గురువారం మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో గంటకు 40 నుంచి 50 కి.మీల వేగంతో గాలులతోపాటు ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఈ ఐదు రోజుల పాటు ఆయా జిల్లాలకు వాతావరణ శాఖ యెల్లో హెచ్చరికలను జారీ చేసింది. బుధవారం తూర్పు విదర్భ దాని పరిసర ప్రాంతాలలో కొనసాగిన ఆవర్తనం గురువారం మధ్యప్రదేశ్ నైరుతి ప్రాంతాలలో సగటు సముద్ర మట్టానికి 0.9 కిలో మీటర్ల ఎత్తులో కేంద్రీకృతమై ఉన్నట్లు పేర్కొంది. రాష్ట్రంలోకి క్రింది స్థాయి గాలులు ప్రధానంగా ఆగ్నేయ దిశ నుంచి వీస్తున్నట్లు పేర్కొంది.

# అన్ని రకాల వడ్లకు బోనస్ ఇచ్చి మాట నిలుపుకోండి

-బోనస్ ఇచ్చేవరకు పోరాటం సాగిస్తాం

-అబద్ధాల, బోగస్ మాటల సీఎం రేవంత్ రెడ్డి

-బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్

-సిరిసిల్ల తెలంగాణ భవన్ లో బీఆర్ఎస్ నిరసన







రాజన్న సిరిసిల్ల : రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల వడ్లకు క్వింటాలకు రూ.500 లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మాజీ సీఎం, పార్టీ అధినేత కేసీఆర్ ఇచ్చిన పిలుపులో భాగంగా గురువారం సిరిసిల్ల తెలంగాణ భవన్ లో బీఆర్ఎస్ శ్రేణులు నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి సర్కార్ మరోసారి రైతులకు డోకా ఇచ్చిందని, బోగస్ మాటలు బహిర్గతం అయ్యాయని ఆరోపించారు. రూ. 500 బోనస్ ఇస్తామని రైతులకు ఎగవేశారన్నారు. కల్లబొల్లి మాటలు, అబద్ధాలతో గద్దెనెక్కి అబద్ధాల సీఎం బోగస్ సీఎంగా పేరు గడించారన్నారు. 2 లక్షల రుణమాఫీ, 15 వేల రైతు భరోస అమలు లేదని, రైతుబంధు పూర్తిస్థాయిలో ఇవ్వలేదని, ధాన్యం కొనుగోలు వేగవంతం లేక వడ్లు రోడ్లపైనే ఉండి వర్షాలకు తడుస్తున్నవని, పూర్తిస్థాయిలో ధాన్యం సేకరణ జరగడం లేదన్నారు. అన్ని రకాల ధాన్యానికి బోనస్ ప్రకటించి ఎన్నికలు కాగానే సన్నం వడ్లకే ఇస్తామనడం మోసమని ఆరోపించారు. సీఎం బోగస్ మాటలను నిరసిస్తూ ప్రతి రైతును కదిలిస్తామన్నారు. గిట్టుబాటు ధరతో పాటు రూ.500 బోనస్ ఇచ్చే వరకు పోరాటం సాగిస్తామని, రైతులకు అండగా ఉంటామని హెచ్చరించారు. సీఎం ఇచ్చిన బోనస్ రూ. 500 అన్ని రకాల వడ్లకు ఇస్తూ మాట నిలబెట్టుకోవాలని, ప్రభుత్వ హామీలను అమలు చేయాలని, బోనస్ తోపాటు ఏటా ఎకరానికి రూ.15,000 ఇచ్చే వరకు పోరాటం సాగుతుందన్నారు. ఆగస్టులో రెండు లక్షల రుణమాఫీ చేసి రుణాలు రద్దు అయ్యే వరకు పోరాటం సాగిస్తామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి బోగస్ మాటలు విడిచి బోనస్ ఇవ్వాలని తోట ఆగయ్య డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్ మాట్లాడుతూ.. అన్ని రకాల వడ్లకు బోనస్ ఇచ్చే వరకు అలుపెరుగని పోరాటం చేయాలని, పార్టీ శ్రేణులు నిరుత్సాహంగా ఉండరాదని పిలుపునిచ్చారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలు కాలేదన్నారు. బీఆర్ఎస్ పాలనలో 2014 నుండి నిరంతర ప్రణాళికతో సాగిందని, మిడ్ మానేర్ లో 25 టీఎంసీలు నిలువ ఉండేలా పాలన సాగిందన్నారు. ఆరు నెలల్లోనే కాంగ్రెస్ సర్కార్ తెలంగాణలో పంటలను నాశనం చేసిందని, ప్రాజెక్టులు ఎండిపోయాయని, భూగర్భ జలాలు అడుగంటాయని, బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని బదునాం చేసే ప్రక్రియలోనే కాంగ్రెస్ పాలన సాగుతుందన్నారు. పంటల దిగుబడి కూడా తగ్గిందని, పోలింగ్ ముగిసిన వెంటనే సన్న వడ్లకే బోనస్ ఇస్తామని మోసం చేశారని ప్రవీణ్ ఆరోపించారు. సెస్ చైర్మన్ చిక్కాల రామారావు మాట్లాడుతూ.. ప్రభుత్వానికి ప్రజల రైతుల ఉసురు తగులుతుందని, ఐదు నెలల్లో అబద్దాలతో పాలన సాగించారన్నారు. మేనిఫెస్టోలో చేర్చిన హామీలను అమలు చేసే వరకు రైతులతో కలిసి ప్రతిఘటిస్తామని, హక్కుల కోసం పోరాటం చేస్తామని, తొండీలతో ప్రజలను ఇబ్బంది పెట్టవద్దని, సన్న వడ్లు కేవలం ఇంటి కోసమే వేసుకుంటారని, వర్షాకాలంలోనే పండిస్తారని, రెండో పంటలో దొడ్డు వడ్లు వేసుకుంటారని చిక్కాల రామారావు స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ముస్తాబాద్ జడ్పిటిసి శరత్ రావు, ఎల్లారెడ్డిపేట జడ్పిటిసి చీటీ లక్ష్మణరావు, ఫాక్స్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, తంగళ్లపల్లి ఎంపీపీ పి.మానస మాజీ ఎంపీపీ పూసపల్లి సరస్వతి, గజ బింకర్ రాజన్న, కౌన్సిలర్ లు, మండల అధ్యక్షులు, నాయకులు, వివిధ మండలాల నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# ముందే రానున్న నైరుతి రుతుపవనాలు

మొదటిపేజీ తరువాయి...

పైగా నైరుతి రుతుపవనాల ప్రభావం కూడా తొలినాళ్లలో పెద్దగా లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. మండుతున్న ఎండాకాలం ప్రజలందరికీ వాతావరణశాఖ చల్లటి కబురు పంపింది. ఈనెల 31నే నైరుతి రుతుపవనాలు కేరళను తాకే అవకాశం ఉన్నట్లు వెల్లడించింది. మూడేళ్లుగా తీవ్ర వర్షాభావ పరిస్థితులతో రైతులు నష్టపోయారు. వర్షాలు లేక జలాశయాలన్నీ ఖాళీ అయ్యాయి. రుతుపవనాలు రాకతో విస్తరంగా వర్షాలు కురవనున్నాయి. సరైన సమయంలో రుతుపవనాలు పలకరిస్తే....సకాలంలో పంటలు వేయడం వల్ల ఆ తర్వాత వచ్చే తుపాన్‌లు, వరదల నుంచి పంటను కాపాడుకునే అవకాశం ఉంది. వాతావరణశాఖ తెలిపిన చల్లని కబురుతో రైతుల ముఖంలో వెలుగులు నిండాయి. ఇప్పటికే పంటపొలాలను సిద్ధం చేసుకుని వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు. మనదేశంలో నైరుతి రుతుపవనాల వల్లే విస్తరంగా వర్షాలు కురుస్తాయి. వర్షాధార పంటలకూ ఇవే ఆధారం. దేశంలో జూన్, జులై నెలలో పడే వర్షాలే అత్యంత కీలకం. సాధారణంగా నైరుతి రుతుపవనాలు కొంచెం అటు, ఇటుగా జూన్ తొలివారంలోనే దేశంలోకి ప్రవేశిస్తాయి. గతేడాది జూన్ 8న రాగా...ఈసారి వారం రోజులు ముందుగానే పలకరించనున్నాయి. ఒకసారి కేరళలోకి ప్రవేశించిన తర్వాత వారం పదిరోజుల్లోనే దేశవ్యాప్తంగా విస్తరిస్తాయి. తెలంగాణ ఏపీ భూభాగంపైకి విస్తరించి సమృద్ధిగా వర్షాలు కురిపిస్తాయి. కొన్ని చిరుజల్లులు కురిపించడంతో ఆశగా పంటలు వేసి ఆకాశం వైపు ఎదురుచూడటమే పనైపోయింది. వేసిన పంటలు పూర్తిగా ఎండిపోయాయి. రైతులు ఆ పంటలను దున్ని మళ్లీ నాటుకోవాల్సి వచ్చింది. వర్షాధార పంటలపైనే ఆధారపడే తెలుగు రాష్ట్రాల ప్రజలకు నైరుతి రుతుపవనాల రాక ఎంతో కీలకం. అనుకున్న సమయం కన్నా ఆలస్యం కావడం వల్ల తొలినాళ్లలో వర్షాలు లేక ఇబ్బందిపడిన రైతులు... ఆ తర్వాత పంటలు చేతికొచ్చే సమయంలో కుంభవృష్టితో మరోసారి నష్టపోయారు. ఈసారి సకాలంలో వర్షాలు కురుస్తాయన్న వాతావరణశాఖ కబురుతో రైతుల్లో మళ్లీ ఆశలు చిగురించాయి. అదునులోనే పంటలు వేసేందుకు సిద్ధమవుతున్నారు. గతేడాది మిగిల్చిన పంట నష్టాలను సైతం ఈసారి పూడ్చుకోవాలని వరుణ దేవుడిని వేడుకుంటున్నారు.

# యాదాద్రి ప్రాజెక్టు ట్రైల్ రన్

నల్గొండ, : యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్?లో చారిత్రక ఘటం ప్రారంభమైంది. పవర్ ప్లాంట్?లో అధికారులు ట్రయల్ రన్ నిర్వహించారు. చివరి దశకు చేరుకున్న ప్లాంట్ పనులతో రెండు యూనిట్లలో ఫేజ్ -1 కింద టీఎస్ జెన్కో విజయవంతంగా ట్రయల్ రన్ నిర్వహించి విద్యుత్ ఉత్పత్తి దిశగా అడుగులు వేసింది. త్వరలో దశలవారీగా విద్యుత్ ఉత్పత్తిని చేపట్టి గ్రిడ్?కు అనుసంధానం చేయనున్నారు. నల్గొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెం వద్ద 2015లో గత బీఆర్ఎస్ ప్రభుత్వం యాదాద్రి థర్మల్ ప్లాంట్ నిర్మాణాన్ని చేపట్టింది. నాలుగు వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంతో సూపర్ క్రిటికల్ టెక్నాలజీతో జుఖూ నిర్మాణాన్ని తెలంగాణ జెన్కో చేపట్టింది. ఒక్కో యూనిట్?లో 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కానుంది. పవర్ ప్లాంట్ నిర్మాణం అనుకున్న గడువుకన్నా రెండేళ్లు ఎక్కువ కావడంతో అంచనా వ్యయం రూ.29,500 కోట్ల నుంచి రూ.34,500 కోట్లకు పెరిగింది. తాజాగా పవర్ ప్లాంట్ అంచనా వ్యయం రూ.50 వేల కోట్లకు చేరింది.యాదాద్రి పవర్ ప్లాంట్ రెండో దశ నిర్మాణంలో పర్యావరణ ఉల్లంఘనలో జరిగాయని రెండు స్వచ్ఛంద సంస్థలు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటి)కి ఫిర్యాదు చేశాయి. దీంతో ఎన్జీటి యాదాద్రి పవర్ ప్లాంట్ రెండో దశ నిర్మాణానికి పర్యావరణ అనుమతులను నిలిపివేసింది. దీంతో ప్లాంట్ నిర్మాణ పనులు 90 శాతం పూర్తయినప్పటికీ విద్యుత్ ఉత్పత్తి చేసే అవకాశం లేకుండా పోయింది. దీంతో రాష్ట్ర అధికారులు గత ఏడాది నవంబర్ 8న మరోసారి ప్రజాభిప్రాయ సేకరణ జరిపి పర్యావరణ అనుమతుల కోసం ప్రతిపాదనలను కేంద్రానికి పంపారు. వీటిని పరిశీలించిన నిపుణుల మదింపు కమిటీ ప్లాంటు రెండో దశ నిర్మాణానికి అనుమతులను సిఫార్సులను చేసింది. కొన్ని షరతులతో కూడిన అనుమతిని పర్యావరణ శాఖ మంజూరు చేసింది.దీంతో పవర్ ప్లాంట్ పనులను జన్?కో అధికారులు యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టారు. విద్యుత్ ఉత్పత్తికి ఏటా అవసరమయ్యే 3.5 టీఎంసీల నీటిని టెయిల్ పాండ్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్ నుంచి తరలించేందుకు 22 కిలోమీటర్ల మేర చేపట్టిన పైపు లైన్ పనులు, రిజర్వాయర్ నిర్మాణ పనులు కూడా పూర్తయ్యాయి. విద్యుత్ ఉత్పత్తికి కావలసిన బొగ్గును దామరచర్ల మండలం విష్ణుపురం రైల్వేస్టేషన్ నుంచి యాదాద్రి థర్మల్ ప్లాంట్ వరకు 8.5 కిలోమీటర్ల మేర రైల్వేలైన్ కూడా నిర్మిస్తున్నారు. హైటెన్షన్ విద్యుత్‌లైన్ టవర్ల నిర్మాణాలు వేగంగా కొనసాగుతున్నాయి. ఈ ఏడాది డిసెంబర్?లోగా మూడు యూనిట్లలో పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేసే లక్ష్యంతో అధికారులు పనులను యుద్ధ ప్రాతిపదికన చేస్తున్నారు. ఇందులో భాగంగానే మొదటి, రెండవ యూనిట్లలోని యాక్సిలరీ బాయిలర్లలో లైట్ అప్ చేసి ట్రయల్ రన్ నిర్వహించారు. బొగ్గుకు ప్రత్యామ్నాయంగా ఇంధనాన్ని ఉపయోగించి అధికారులు ట్రయల్ రన్ విజయవంతంగా నిర్వహించారు. 275 మీటర్ల ఎత్తు గల చిమ్నీ ద్వారా వాయును విడుదల చేశారు. ట్రయల్ రన్ లో భాగంగా ప్రాథమిక పరీక్షలను పూర్తి చేసినట్లు జెన్కో అధికారులు చెబుతున్నారు.

# ఎపిలో ఇసుక అక్రమ తవ్వకాలు

మొదటిపేజీ తరువాయి...

ప్రతి జిల్లాలో ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక సెల్ లను కూడా ఏర్పాటు చేయాలని సుప్రీం ఆదేశించింది.అక్రమ ఇసుక తవ్వకాలను నిషేధించడానికి పెద్ద ఎత్తున పబ్లిసిటీ ఇవ్వాలి. ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నంబర్లు, ఈ మెయిల్ ఐడీలను కూడా ఏర్పాటు చేయాలి. తమ ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘిస్తే కోర్టు ధిక్కార చర్యలను తీసుకుంటాం. కమిటీలోని అధికారులు సుప్రీంకోర్టు నియమించిన అధికారులుగా గుర్తెరిగి విధులను నిర్వర్తించాలి. ఉల్లంఘనలకు పాల్పడిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోండని సుప్రీం ఆదేశాలు జారీ చేసింది. ఏపీలో యథేచ్ఛగా అక్రమ ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని కేంద్ర పర్యావరణ, అటవీశాఖ ధృవీకరించింది. ఆ మేరకు మధ్యంతర నివేదికను సమర్పించింది. 10 వేల కోట్ల రూపాయల మేరకు అక్రమ ఇసుక రవాణా జరిగిందని ప్రతివాది తరపు న్యాయవాది సిద్దార్థ లూథ్రా.. సుప్రీంకోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ప్రభుత్వం కొనసాగిస్తున్న అక్రమ ఇసుక తవ్వకాలను ఫోటోలు, ఆధారాల సహా ప్రతివాది దండా నాగేంద్ర కుమార్ నేడు సుప్రీం ముందు ఉంచారు. జస్టిస్ అభయ్ ఓకా నేతృత్వంలోని ధర్మాసనం ముందు విచారణ జరిగింది. అక్రమ ఇసుక తవ్వకాలను తక్షణం నిలిపివేయడానికి వెంటనే అధికారుల బృందాలను క్షేత్ర స్థాయికి పంపాలని గత వారం సుప్రీం ఆదేశాలు జారీ చేసింది. కేంద్ర పర్యావరణ, అటవీశాఖ అధికారులు కూడా క్షేత్ర స్థాయికి వెళ్లి అక్రమ ఇసుక తవ్వకాలు ఆపేశారా.. లేదా? అన్నది తనిఖీ చేయాలని కూడా సుప్రీం ఆదేశించింది. ఇసుక అక్రమాలపై వచ్చిన ఫిర్యాదులపై చర్యలు తీసుకుంటామని ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన అఫిడవిట్‌ను సుప్రీం ధర్మాసనం తిరస్కరించింది. ఏపీ ప్రభుత్వం చర్యలన్నీ కాగితాలకే పరిమితమని తమకు తెలుసని సుప్రీం ధర్మాసనం పేర్కొంది. నేడు సుప్రీంకోర్టు అక్రమ ఇసుక తవ్వకాల నిలిపివేతపై తీసుకున్న చర్యలను అఫిడవిట్ రూపంలో సమర్పించాలని ఏపీ ప్రభుత్వాన్ని సుప్రీం ధర్మాసనం ఆదేశించింది. ఏపీలో ఇసుక అక్రమ తవ్వకాలు ఇంకా కొనసాగుతున్నాయంటూ కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ కూడా సుప్రీంకోర్టుకు నివేదించినట్లు సమాచారం. ఈ క్రమంలో ఇసుక తవ్వకాలపై సుప్రీంకోర్టు మార్గదర్శకాలు విడుదల చేసింది. ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కారం కోసం ప్రతి జిల్లాలో పోలీసు అధికారు లతో కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశించింది. టోల్‌ఫ్రీ నంబర్, ఈమెయిల్ ఏర్పాటు చేసి విస్తృత ప్రచారం కల్పించాలని సూచించింది. కేంద్ర పర్యావరణశాఖ తరచూ తనిఖీలు చేపట్టాలని.. ఆ సమాచారాన్ని రాష్ట్ర అధికారులకు ఇవ్వాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు చెప్పాక కూడా యంత్రాలు వాడారని కేంద్ర పర్యావరణ శాఖ తరఫు న్యాయవాది తెలపగా.. కోర్టు ఉత్తర్వులను అనంతరం తదుపరి విచారణ జులై 15కి వాయిదా వేసింది.

# రాజన్న సిరిసిల్ల జిల్లాలో విషాదం

## పిగుడుపాటుకు ఇద్దరు మృతి
## పలు జిల్లాల్లో వర్షాలకు పంటలకు నష్టం

రాజన్న సిరిసిల్ల, : రాష్ట్రమంతటా పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. ఈదురుగాలులు, ఉరుములు పిడుగులతో వర్షాలు పడ్డాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. జిల్లాలో కురిసిన భారీ వర్షానికిపిడుగు పడి ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. తంగళ్లపల్లి మండలం భరత్‌నగర్‌లో పిడుగుపాటుకు రామడుగు చంద్రయ్య అనే వ్యక్తి మృతి చెందాడు. అలాగే వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజ్‌పల్లిలో కంబాల శ్రీనివాస్ మృతి చెందగా మరో ముగ్గురికి గాయాలయ్యాయి. కాగా, ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలకు రహదారుల పక్కన చెట్లు విరిగిపడ్డాయి. పలు చోట్ల ఇండ్ల పైకప్పులు గాలికి కొట్టుకుపోయాయి. విద్యుత్ స్తంభాలు నెలకొరిగాయి. రాకపోకలకు అంతరాయం ఏర్పడటంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో వాతావరణం ఒక్కసారిగా మారింది. రాష్ట్రంలో నాలుగు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించిన సంగతి తెలిసిందే. సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో పలు చోట్ల వర్షం కురిసింది. ఇదిలావుంటే సంగారెడ్డి జిల్లాలోని సంగారెడ్డి జిల్లా కేంద్రంతో పాటు వట్ పల్లి, కోహిర్ మండలాల్లో వర్షం కురిసింది. మెదక్ జిల్లా నర్సాపూర్, పాపన్నపేట మండలాల్లో ఈదురు గాలులతో కూడిన వాన పడింది. సంగారెడ్డి పట్టణంలో భారీ వర్షం కురిసింది. అరగంట వ్యవధిలో సంగారెడ్డి పట్టణం తడిసి ముద్దయింది. రోడ్లపై భారీగా పారుతున్న వరద నీటితో వాహన దారులు ఇబ్బందులు పడుతున్నారు. సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట వర్షపు నీరు భారీగా నిలిచింది. పోతిరెడ్డిపల్లి చౌరస్తాలో డ్రైనేజీలు పొంగిపొర్లుతుండడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గాలి దుమారానికి పలు చోట్లు చెట్ల కొమ్మలు విరిగిపడగా.. బారికేడ్లు నెలకొరిగాయి. సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో వరిపొలాలు కోసి ధాన్యాన్ని కుప్పగా పోసిన రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం కారణంగా చాలా ప్రాంతాల్లో ధాన్యం కుప్పలు తడిసి ముద్దయ్యాయి.

# ఎన్నికల అనంతర హింసపై చర్యలు

## బాధ్యులను గుర్తించి వెంటనే శిక్షించాలి
## గవర్నర్‌ను కలిసి విన్నివించిన మంత్రులు

విజయవాడ, : సార్వత్రిక ఎన్నికల పోలింగ్ తర్వాత చోటు చేసుకున్న అల్లర్లు, దాడులు వెనుక ఉన్న బాధ్యులపై తగిన చర్యలు తీసుకునేలా ఆదేశించాలని వైసీపీ నేతలు గవర్నర్‌ను కోరారు. రాజ్‌భవన్‌కు వెళ్లిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతల బృందం.. గవర్నర్‌ను కలిసి ఫిర్యాదు చేసింది.. రాష్ట్రంలో పోలింగ్ అనంతరం చెలరేగిన హింసపై గవర్నర్ కు ఫిర్యాదు చేశారు.. వైసీపీ నేతలు, మంత్రులు.. ఈ బృందంలో మంత్రి బొత్స సత్యనారాయణ, మేరుగు నాగార్జున, మాజీ మంత్రి పేర్ని నాని, మోపిదేవి వెంకటరమణ , కావటి మనోహర్ నాయుడు తదితరులున్నారు.. ఈ సందర్భంగా మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. పోలింగ్ తర్వాత జరుగుతున్న హింస ఆందోళన రేపుతోంది.. ఆయా ప్రాంతాల్లో ఉన్న పోలీసుల పనితీరుపై ఫిర్యాదు చేశాం.. అబ్జర్వర్ దీపక్ మిశ్రా పక్షపాతంగా వ్యవహరిస్తున్నారు.. టీడీపీ వాళ్లు ఫిర్యాదు చేస్తే విచారణ లేకుండా చర్యలు తీసుకున్నారు.. అబర్వర్ గా ఉన్న దీపక్ మిశ్రా పై న్యాయ విచారణ చేయాలని డిమాండ్ చేశారు.. ఎన్నికల సంఘం నుంచి రిపోర్ట్ తెచ్చుకుని దీపక్ మిశ్రాను మార్చాలని గవర్నర్‌ను కోరినట్టు వెల్లడించారు మంత్రి బొత్స సత్యనారాయణ. ఇక, పల్నాడు ఎస్పీ, ఐజీ త్రిపాఠి వంటి కొందరు అధికారులు ఎన్నికల వేల పచ్చ చొక్కాలు వేసుకున్నారు అంటూ విమర్శలు గుప్పించారు మంత్రి మేరుగ నాగార్జున.. రాయలసీమ, పల్నాడులో పోలీసులను మార్చాలని కోరాం.. కౌంటింగ్ ఉన్న నేపథ్యంలో దీపక్ మిశ్రాను మార్చి దేశంలో ఏ అధికారి అయినా పర్లేదు అని గవర్నర్ ను కోరాం అన్నారు. మరోవైపు.. ఎంపీ మోపిదేవి వెంకట రమణ మాట్లాడుతూ.. దీపక్ మిశ్రా వల్లే ఈ విధ్వంసం జరిగిందని మండిపడ్డారు. పోలీసుల పక్షపాత ధోరణి వల్లే ఈ హింస జరుగుతోందన్నారు. దీపక్ మిశ్రా కనుసన్నల్లో పోలీసులు ఉన్న చోట ఈ హింస జరుగుతుందన్న ఆయన.. ప్రశాంతంగా ఉన్న ఏపీలో ఇలాంటి పరిస్థితులు రావటానికి కారణం దీపక్ మిశ్రా.. అతడిపై చర్యలు తీసుకోవాలని గవర్నర్ ను కోరామని ఎంపీ మోపిదేవి వెంకట రమణ పేర్కొన్నారు.

## పోలీసు జవాను ఆత్మహత్య

శ్రీశైలం:శ్రీశైలం పోలీస్టేషన్ లో కానిస్టేబుల్ గన్ తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన శ్రీశైలంలో స్దానికులను పోలీసులను ఒక్కసారిగా ఉలిక్కిపడేటట్లు చేసింది.శ్రీశైలం పోలీస్టేషన్ లో కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న శివశంకర్ రెడ్డి ఇవాళ తెల్లవారుజామున సుమారు ఐదుగంటల సమయంలో స్టేషనులోని రెస్ట్ రూములో సర్వీస్ గన్ తో తలకు కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు శ్రీశైలం పోలీసులు చర్చించుకుంటున్నారు.కానిస్టేబుల్ శివశంకర్ రెడ్డి స్వగ్రామం కర్నూలుగా పోలీసులు గుర్తించారు.అయితే ఆత్మహత్యకు గల కారణాలు పోలీసులు విచారణ చేస్తున్నారు కానిస్టేబుల్ శివశంకర్ రెడ్డి 2001వ బ్యాచ్‌గా పోలీసులు తెలిపారు. శివశంకర్ రెడ్డి ఆత్మహత్య తెలుసుకున్న వార్త తెలియగానే శ్రీశైలం పోలీసులు గ్ర్భాంతికి గురయ్యారు సిఐ ప్రసాదరావు హుటాహుటిన స్టేషను కు చేరుకుని ఘటన స్దలాన్ని పరిశీలించారు.మృతి చెందిన శివశంకర్ రెడ్డి కుటుంభికులకు సమాచారం తెలిపారు విషయాన్ని ఉన్నతస్దాయి అధికారులకు తెలిపామని సిఐ అన్నారు. శివశంకర్ రెడ్డి (46) కానిస్టేబుల్ గా శ్రీశైలం పోలీస్టేషన్ లొ విధులు నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు ఆత్మహత్య వీడియోలను చిత్రీకరించేందుకు పోలీసులు మీడియాను నిరాకరించారు.డిఎస్పి శ్రీనివాసరావు శ్రీశైలం చేరుకున్న తరువాత మీడియాను అనుమతిస్తామని సిఐ ప్రసాదరావు అన్నారు.

## రైల్వే కోడూరులో అంగరంగ వైభవంగా గంగమ్మ జాతర

అన్నమయ్య: రైల్వే కోడూరు పట్టణంలో బలిజ వీధిలో నిర్వహిస్తున్న గంగమ్మ జాతర అంగరంగ వైభవంగా జరుగుతున్నది. ఇందుకు సంబంధించి భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. వేలాది మంది భక్తులు తండ్డోపతండాలుగా తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుంటున్నారు. జాతరకు ముందు రోజున అనేక రకాల దేవతల వేషధారణలతో ఊరేగింపు నిర్వహించారు. పట్టణాన్ని విద్యుత్ దీపాలతో సుందరీకరంగా అలంకరించారు. గురువారం ఉదయం అమ్మవారిని తయారు చేసుకుని ఊరేగింపుగా నలువీధులలో తిప్పుకుంటూ గుడి వద్దకు తీసుకువచ్చి విగ్రహాన్ని ప్రతిష్టించారు.

# 18న కేబినెట్ భేటీ

మొదటిపేజీ తరువాయి...

విద్యుత్తు సంస్థల బకాయిలు ఇంకా తేలలేదు. ఈ నేపథ్యంలో ఇప్పటివరకు చేసిన ప్రయత్నాలను ముఖ్యమంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. తదుపరి చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించారు. రెండు రాష్ట్రాలు సామరస్యంగా పరిష్కరించుకునేందుకు వీలున్న ఉద్యోగుల బదిలీల వంటి అంశాలు పూర్తి చేయాలని ఆదేశించారు. రెండు రాష్ట్రాల మధ్య సయోధ్య కుదిరిన వాటిని పరిష్కరించుకోవాలని, పీటముడి పడిన అంశాలపై తెలంగాణ ప్రయోజనాలను కాపాడేలా తదుపరి కార్యాచరణ చేపట్టాలని ముఖ్యమంత్రి అధికారులను అప్రమత్తం చేశారు. పదేండ్లు పూర్తి కానుండటంతో పునర్విభజన చట్టం ప్రకారం ఉమ్మడి రాజధానిగా ఉన్న హైదరాబాద్ కేవలం తెలంగాణ రాష్ట్ర రాజధానిగా మారనుంది. ఈ పదేండ్ల కాలానికి ఏపీకి కేటాయించిన లేక్ వ్యూ గెస్ట్ హౌజ్ వంటి భవనాలను జూన్ 2 తర్వాత రాష్ట్ర అధీనంలోకి తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.పునర్విభజన చట్ట ప్రకారం పెండింగ్ లో ఉన్న అంశాలు, ఇప్పటి వరకు రెండు రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయంతో పంపిణీ చేసుకున్న వివరాలపై సమగ్రమైన నివేదికను తయారు చేయాలని ఆదేశించారు.

## సంపాదకీయం

శుక్రవారం, మే 17, 2024

# అభివృద్ధి అంశాలు లేకుండానే ఎన్నికలు....


70 శాతం సీట్లకు పైగా స్థానాలకు లోక్‌సభ ఎన్నికలు పూర్తికాగా, ఎన్నికల ప్రచారం గతి తప్పుతున్నట్టు స్పష్టం అవుతుంది.ఎన్నికల్లో ప్రజాతీర్పుపై ఎంతో భరోసాతో ప్రచారం ప్రారంభించిన కీలక నేతలు ఆత్మరక్షణలో పడి తమ రాజకీయ మనుగడ కోసం విలువలకు తిలోదకాలిస్తున్నట్లు స్పష్టం అవుతున్నది. 'ఇండియా' కూటమి ద్వారా నరేంద్ర మోడీ ప్రభంజనాన్ని అడ్డుకోగలననే ధీమాతో ఎన్నికల ప్రచారం ప్రారంభించిన కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఇప్పుడు తమ కుటుంబానికి బలీయమైన రెండు నియోజకవర్గాలలో ఎక్కడినుండి పోటీ చేయాలో తేల్చుకోలేక, చివరకు ఒక చోట నుండి పోటీ చేస్తున్న దృశ్యం కనిపిస్తున్నది. 1980 నుండి గాంధీ కుటుంబానికి కంచుకోటగా ఉండటమే కాకుండా వరుసగా ఐదుసార్లు సోనియా గాంధీని ఎన్నుకున్న రాయబరేలి కేవలం సురక్షిత స్థానం అని మాత్రమే ఎంచుకొన్నట్లు స్పష్టం అవుతుంది. వరుసగా ఐదోసారి ఎన్నికల్లో పోటీ చేస్తున్న రాహుల్ చెల్లెలు ప్రియాంక గాంధీని ఎన్నికల్లో దింపేందుకు ప్రధాని మోడీ చేస్తున్న 'కుటుంబ రాజకీయాలు' విమర్శలకు భయపడి వెనుకడుగు వేసినట్టు కూడా తెలుస్తున్నది. ఒక వంక ప్రధాని మోడీ ఎన్నికల ప్రచార సభలలో 'యువరాజు'(రాహుల్ గాంధీ)ని లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేస్తుండగా, ఆయన మాత్రం తన సీటు విషయంలో తికమక పడుతున్నట్లు వెల్లడవుతున్నది. ఎందుకంటె రాయబరేలి, అమేథీ సీట్లను గెల్చుకోవడం ద్వారా మాత్రమే ఉత్తర ప్రదేశ్‌లో కాంగ్రెస్ తన ఉనికి కాపాడుకోగలదు.వరుసగా కేంద్రంలో బిజెపి అధికారంలోకి వస్తే అనేక ప్రాంతీయ పార్టీల మనుగడ ప్రశ్నార్ధకం కాగలదు అనే అంశం ఈ సందర్భంగా పలువురి దృష్టిని ఆకర్షిస్తోంది. ఉంటె తమతో కలిసి ఉండాలి లేదా అటువంటి వారి ఉనికి ప్రశ్నార్థకం కాగలదని హెచ్చరికలను ప్రధాని స్వయంగా ఇచ్చినట్లయింది. ఎన్నికల పొత్తుకోసం చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో జూన్ 4 తర్వాత ఒడిశాలో బిజెడి ఉనికి ప్రశ్నార్థకం కాగలదని ఈ సందర్భంగా సంకేతం ఇవ్వడం గమనార్హం. తెలుగు రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలకు సైతం అటువంటి హెచ్చరికలు వెలువడుతున్నాయి. నేడు జెఎంఎం అధినేత హేమంత్ సోరేన్, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ వంటి వారు ఇటువంటి హెచ్చరికలను ఖాతరు చేయకుండా కాంగ్రెస్‌తో పొత్తులు చేసుకున్న కారణంగానే జైళ్లలో గడపాల్సి వస్తుందని మరచిపోలేము. బిఆర్ఎస్ ఎంఎల్‌సి కవిత సైతం అందుకోసమే జైలుకు వెళ్లాల్సి వచ్చిందని స్వయంగా కెసిఆర్ ఆరోపిస్తున్నారు. ఇటువంటి సవాళ్ళను కేజ్రీవాల్, ఉద్ధవ్ థాక్రే, శరద్ పవర్, హేమంత్ సోరేన్, కెసిఆర్ వంటి వారు ధైర్యంగా ఎదుర్కొనే ప్రయత్నం చేస్తున్నారు.మరోవంక ప్రధాని మోడీ ఎన్నికల ప్రచారం పాకిస్తాన్, ముస్లింల చుట్టూ తిరుగుతూ ఉండటం విస్మయం కలిగిస్తోంది. మన సరిహద్దుల్లో ఇంకా రెచ్చగొట్టే విధంగా వ్యవహరిస్తూ అక్రమ నిర్మాణాలను సైతం చేబడుతున్న చైనా గురించి మాట్లాడే ధైర్యం చేయడం లేదు. కానీ రాహుల్ గాంధీ గెలుపొందాలని పాకిస్తాన్ కోరుకుంటుందని అంటూ అక్కడ అధికారం కోల్పోయిన ఇమ్రాన్ ఖాన్ మంత్రివర్గంలో పని చేసిన ఒకరి మాటలను పట్టుకొని ప్రచారం చేయడం గమనిస్తే తమ ప్రభుత్వ పనితీరు ఆధారంగా మరోసారి గెలుపొందగల నమ్మకం సడలుతుందా అనే ప్రశ్న తలెత్తుతుంది. సామ్ పిట్రో, మణిశంకర్ అయ్యర్ వంటి కాలంచెల్లిన నాయకులు ఎన్నికల సమయంలో చేస్తున్న బాధ్యతారహిత వ్యాఖ్యలు పార్టీని ఇరకాటంలో పడవేస్తున్నా బిజెపికి బలమైన ప్రచార ఆయుధాలు సమకూరుస్తున్నా అటువంటి వారిని కట్టడి చేయడంలో రాహుల్ ఓ విధంగా నిస్సహాయంగా కనిపిస్తున్నారు.తనదారి తనదే గాని, మొత్తం పార్టీని తనతో తీసుకెళ్లడంలో మొదటి నుండి విఫలమవుతున్నారు. అందుకనే రాహుల్ నాయకత్వం సామర్థ్యంపై కాంగ్రెస్‌లోనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. భారత్‌కు మాత్రమే కాకుండా అనేక దేశాలకు ఆందోళనకరంగా మారిన చైనా ధోరణులను కట్టడి చేసేందుకు దృఢ వైఖరిని అవలంబించలేకపోతున్నాము. ముఖ్యంగా వాణిజ్యలోటు ప్రతి ఏడాది పెరుగుతున్నా తగ్గించే ప్రయత్నం చేయలేకపోయాము. కీలక రంగాలలో చైనా పై ఆధారపడటం జాతీయ భద్రతకు ప్రమాదరకరమనే హెచ్చరికలను పట్టించుకోలేక పోతున్నాం. భారత్ అని బూచిని చూపి పాకిస్తాన్‌లో ఇప్పటి వరకు రాజకీయాలను శాసిస్తూ వస్తున్న సైన్యం ఆధిపత్యానికి గండిపడుతోంది. కానీ భారత్ నాయకత్వం మాత్రం పాకిస్తాన్ బూచి చూపిస్తూ ఇక్కడ తమ రాజకీయ వైఫల్యాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నది. దాదాపు అన్ని రాజకీయ పార్టీలలో తమ నాయకత్వంపై ఓ విధమైన 'అసహనం', 'అవిశ్వాసం' వెల్లడి కావడం నేడు భారత రాజకీయ రంగం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యగా భావించవచ్చు. బిజెపి అభ్యర్థులలో నాలుగోవంతు మంది ఎన్నికల సమయంలో పార్టీలో చేరినవారే. నిన్నటి వరకు తాము అవినీతిపరులుగా, ప్రజావ్యతిరేకమైన వారుగా విమర్శలు కురిపించిన వారి విజయం కోసం ఇప్పుడు తామెందుకు పని చేయాలనే నిర్లిప్తత ఆ పార్టీ శ్రేణులలో వ్యక్తం అవుతుంది.

# సైద్ధాంతిక పోరుగా సార్వత్రిక సమరం..




ప్రధానమంత్రి నరేంద్రమోదీ మూడోసారి అధికారంలోకి వస్తారా లేదా అన్న ప్రశ్నతో నిమిత్తం లేకుండా ఈ ఎన్నికలతో భారత రాజకీయాలు ఒక నిర్ణాయక ఘట్టంలో ప్రవేశించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ ఎన్నికలలో భారతదేశ ప్రజలు ఏమి కోరుకుంటున్నారు అన్న ప్రశ్నకు త్వరలో సమాధానం లభించనుంది. 1952 నుంచి వరుసగా మూడుసార్లు జరిగిన ఎన్నికలు వేరు. అప్పుడు కాంగ్రెస్‌కు పెద్ద పోటీ లేదు. కాని 2014, 2019, 2024 ఎన్నికలు వేరు. దేశ రాజకీయ, సామాజిక, ఆర్థిక విధానాలు ఏ దిశన ఉండాలో ప్రజలు కోరుకుంటున్నారో సూచించే ఎన్నికలు ఇవి. గతంలో ఎన్నడూ లేనంతగా దేశంలో రెండు వాదాలు ఈ ఎన్నికల్లో హెూరా హెూరీ పోరాడుతున్నాయి. తెలిసో, తెలియకో, ఆలోచించో, అన్యమనస్కంగానో ప్రజలు రెండు శిబిరాల్లో ఏదో ఒక శిబిరంలో చేరారు. రెండు దశాబ్దాల క్రితం నిలదొక్కుకునేందుకు నానా అగచాట్లు పడిన ఒక పార్టీ ఇవాళ దేశంలోనే ప్రబల శక్తిగా మారింది. ఆ శక్తిని ఢీకొనేందుకు ఇప్పుడు ఇతర వర్గాలన్నీ తమ అంతర్వైరుధ్యాలన్నీ మరిచి ఏకం కావల్సిన చారిత్రక ఆవశ్యకతను గ్రహించాయి. వారితో పాటు మేధావులు, ప్రజాస్వామిక వాదులు, సమాజం ఫలానా విధంగా ఉండాలని కోరుకుంటున్న బుద్ధిజీవులు కూడా విడిపోయారు. అందువల్ల స్పష్టంగా ఆలోచనల మధ్య సమరం జరుగుతున్న ఎన్నికలు ఇవి. నాలుగోదశ ఎన్నికలు జరిగి దేశంలో 379 స్థానాలకు ఎన్నికలు పూర్తయిన తర్వాత కూడా ప్రధానమంత్రి నరేంద్రమోదీ అంతే సమధికోత్సాహంతో ఎన్డీఏకు 400 సీట్లు రావడం ఖాయం అని ఆత్మస్థైర్యంతో ప్రకటించారు. కాంగ్రెస్‌కు 50 సీట్లు కూడా రావని ప్రతిపక్ష హెూదా కూడా లభించదని ఆయన స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ మరోసారి ప్రధాని అవుతారని, మూడో టర్మ్ మొత్తం ఆయనే పాలిస్తారని కేంద్ర హెూంమంత్రి అమిత్‌షా ప్రకటించారు. సూర్జిత్ భల్లా వంటి ఆర్థికవేత్తలు కూడా బీజేపీ 350 సీట్లు గెలుస్తోందని చెబుతుంటే, మోదీ ఉధృతి పెరుగుతుందే కాని తగ్గడం లేదని బీజేపీ అనుకూల మేధావులు వాదిస్తున్నారు. 2014లో కాంగ్రెస్ వ్యతిరేక పవనాలు వీస్తే, 2019లో పుల్వామా, బాలాకోట్ ఘటనలు ఫలితాలను ప్రభావితం చేశాయి. ఈ సారి ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఒక వ్యక్తిగా దేశంలోని మొత్తం ప్రతిపక్ష పార్టీలనన్నిటినీ ఢీకొనేందుకు సిద్ధపడ్డారు. మోదీ వర్సెస్ ఇతరులు అన్నట్లుగా ప్రచార సరళిని తీర్చిదిద్దారు. ప్రతి నియోజకవర్గంలోనూ మోదీయే పోటీ చేస్తున్నారు అన్న భావన ముఖ్యంగా ఉత్తరాదిన కల్పించారు. నిజంగా ఇది ప్రతిపక్షాలకు మాత్రమే కాదు, ఒక భావజాలాన్ని వ్యతిరేకిస్తున్న, ముఖ్యంగా మోదీని ద్వేషిస్తున్న వారందరికీ సవాల్. మరో వైపు ప్రతిపక్షాలు కూడా ఈ ఎన్నికలు నిర్ణాయకంగా మారనున్నాయని అంగీకరిస్తున్నాయి. ప్రతి దశలోనూ పోలింగ్ పూర్తయిన కొద్దీ ప్రతిపక్షాల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతోంది. బీజేపీ గ్రాఫ్ పడిపోతుందని, మోదీ చేస్తున్న ప్రసంగాలు, వ్యాఖ్యలే ఆయనలో భయాందోళనలను ప్రతిఫలిస్తున్నాయని వారు విశ్వసిస్తున్నారు. మోదీ కీ గ్యారంటీ అన్న నినాదాన్ని కూడా పక్కన పెట్టి ప్రతిపక్షాలపై దాడులు ప్రారంభించారని, కాంగ్రెస్ మేనిఫెస్టోను సైతం వక్రీకరిస్తున్నారని వారు ఎత్తిచూపుతున్నారు. కార్పొరేట్ ఎజెండాకు అనుకూలంగా మోదీ పనిచేస్తుంటే తాము సామాజిక న్యాయ ఎజెండాతో ముందుకు వెళుతున్నామని చెప్పుకుంటున్నారు. ఈ రకంగా కూడా రెండు విధానాల మధ్య ఘర్షణ జరుగుతోందని ప్రతిపక్షాలు కూడా స్పష్టీకరిస్తున్నాయి. అయితే ఎన్నికల సమయంలో నేతలు ఏ రకంగా ప్రచారం చేసినా, ఎన్ని వ్యాఖ్యలు చేసినా కేవలం వాటి ద్వారానే ప్రజలు ప్రభావితం అవుతారని, ముందుగా తాము ఏర్పర్చుకున్న నిశ్చితాభిప్రాయానికి భిన్నంగా ఆలోచిస్తారని భావించడం అమాయకత్వమే. కొంత అనిశ్చిత పరిస్థితుల్లో ఉన్న ఓటర్లు మాత్రమే ఎన్నికల సమయంలో జరిగే ప్రచారాలకు, పరిణామాలకు ప్రభావితమవుతారు. 1991లో రాజీవ్ గాంధీ హత్య జరిగినప్పుడు తొలి దశ ఫలితాలకు, మలిదశ ఫలితాలకూ మధ్య వ్యత్యాసం స్పష్టంగా కనపడింది. ఇప్పుడా పరిస్థితులేమీ లేవు. నిజానికి దేశంలో చాలా చోట్ల ప్రజలు తాము ఎవరికి ఓటు వేయాలో ఎన్నికలకు చాలా ముందే నిర్ణయించుకున్నారు. ఆంధ్రప్రదేశ్ లాంటి చోట్ల ఇలాంటి పరిస్థితులు చాలా స్పష్టంగా కనిపిస్తున్నాయి. దేశంలో మూడు వాదనలు ఇప్పుడు ఎదురవుతున్నాయి. మోదీపై జనాదరణ ఏ మాత్రం తగ్గలేదని ఆయన మళ్లీ భారీ మెజారిటీతో అధికారంలోకి వస్తారని ఒక వర్గం చెబుతోంది. ఉత్తరప్రదేశ్ లాంటి చోట్ల బీజేపీకి సీట్లు పెరుగుతాయే కాని తగ్గే అవకాశాలులేవని వారు వాదిస్తున్నారు. మోదీకి కనీసం 70 నుంచి వంద సీట్లు తగ్గుతాయని, ఆయన మళ్లీ ప్రధానమంత్రి కావడం కష్టమని ఇంకో వర్గం చెబుతోంది. 2004లో వాజపేయికి తిరుగులేదని అందరూ భావించారని, భారతదేశం వెలిగిపోతుందన్న ప్రచారాన్ని ఆర్భాటంగా జరిపారని, అయినప్పటికీ ప్రజలు బీజేపీని తిరస్కరించి యూపీఏను అధికారంలోకి తీసుకువచ్చారని వారు గుర్తు చేస్తున్నారు. అందువల్ల ఈ ఎన్నికలను 2004లో జరిగిన ఎన్నికలతో పోల్చవచ్చని వారు వాదిస్తున్నారు. ఇక మూడోవర్గం మోదీ, బీజేపీ చెప్పుకుంటున్నట్లు ఎన్డీఏకు 400 సీట్లు రాకపోయినా అధికారంలోకి రావడం ఖాయమని వాదిస్తోంది. 2019కీ, ఇప్పటికీ పరిస్థితుల్లో తేడా లేదని, కాకపోతే కొన్ని రాష్ట్రాల్లో సీట్లు తగ్గినా ఎన్డీఏ ప్రభుత్వంలోకి రావడం ఖాయమని వారు వాదిస్తున్నారు. ఏదో గొప్ప పరిణామం జరిగి బీజేపీ 200 సీట్ల కంటే తక్కువకు పడిపోతుందన్న విషయం వారు ఏ మాత్రం అంగీకరించడం లేదు. అయితే బీజేపీ ఈ దేశంలో మెజారిటీ వాద పార్టీగా అవతరిస్తుందని మోదీ సమర్థకులు, వ్యతిరేకులు ఇరువురూ అంగీకరిస్తున్నారు. 2014లో కాంగ్రెస్, మిత్రపక్షాలు ఎదుర్కొంటున్న వ్యతిరేక పవనాలు బీజేపీ ఇప్పుడు ఎదుర్కోవడంలేదని వారే చెబుతున్నారు. ఉచిత రేషన్, కశ్మీర్‌లో 370 రద్దు, రామమందిర నిర్మాణం, విదేశాల్లో దేశ ఆత్మగౌరవాన్ని కాపాడడం వంటి నాలుగు అంశాలే ప్రజలు తమకు చెబుతున్నారని, బీజేపీ పట్ల వారి ఆదరణకు ఇదే కారణమని యోగేంద్ర యాదవ్, సుధీంద్ర కులకర్ణి వంటి రాజకీయ విశ్లేషకులు కూడా అంగీకరిస్తున్నారు. అయితే ధరల పెరుగుదల, నిరుద్యోగం, రైతుల సమస్యలు, దైనందిన జీవన సమస్యల విషయంలో మోదీ హయాంలో ఏమీ మార్పులేదని గ్రహించినందువల్ల బీజేపీకి సీట్లు తగ్గే అవకాశాలున్నాయని వారు వాదిస్తున్నారు. 2019లో మోదీకి ఓటు వేసిన వారిలో అనేకమంది ఇప్పుడు పునరాలోచనలో పడ్డారని వారి అభిప్రాయం. కర్ణాటకలో 10 సీట్లు, మహారాష్ట్రలో 20 సీట్లు, రాజస్థాన్, గుజరాత్‌లలో 10 సీట్లు, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, జార?ండ్‌లలో 10 సీట్లు, హర్యానా, ఢిల్లీ, పంజాబ్, హిమాచల్ లలో 10 సీట్లు, ఉత్తరప్రదేశ్, బిహార్‌లలో 30 సీట్లు, పశ్చిమ బెంగాల్, అస్సాం, ఇతర ఈశాన్య రాష్ట్రాలు, కేంద్ర ప్రాంత పాలిత రాష్ట్రాల్లో 10 సీట్లు కనీసం తగ్గిపోతాయని యోగేంద్ర యాదవ్ ఇటీవల ఒక టీవీ ఇంటర్వ్యూలో చెప్పారు.

# తెలంగాణలో తగ్గని పొలిటికల్ ఫీవర్ మరో ఎన్నికపై పార్టీలు ఫోకస్



తెలంగాణలో లోక్ సభ ఎన్నికలు ముగిసినా మరో ఎన్నికకు ప్రధాన పార్టీలన్నీ సిద్ధమవుతున్నాయి. అదే ఈ నెల చివరన జరిగే ఎమ్మెల్సీ ఉప ఎన్నిక. వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి జరిగే ఉప ఎన్నికకు పార్టీలు రెడీ అవుతున్నాయి. మూడు జిల్లాల నేతలతో మూడు పార్టీలు ముమ్మర కసరత్తు ప్రారంభించి.. పట్టభద్రుల స్థానంపై పట్టుకోసం ప్రయత్నిస్తున్నాయి. రాష్ట్రంలో లోక్ సభ ఎన్నికల సమరం సమాప్తమైన ఎన్నికల మోడ్ మాత్రం పోలేదు. వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక హడావుడి మొదలైంది. పల్లా రాజేశ్వరరెడ్డి ఎమ్మెల్యేగా గెలిచి ఎమ్మెల్సీ రాజీనామా చేయడంతో ఉప ఎన్నిక వచ్చింది. కాంగ్రెస్ పార్టీ నుంచి చింతపండు నవీన్ మల్లన్న, బిఆర్ఎస్ నుంచి ఏనుగుల రాకేశ్ రెడ్డి, బిజెపి తరపున ప్రేమెందర్ రెడ్డి బరిలో ఉన్నారు. సిట్టింగ్ స్థానాన్ని ఎలాగైనా నిలబెట్టుకోవాలని బిఆర్ఎస్ ప్రయత్నాలు గట్టిగా చేస్తోంది. ఈ నెల 27 న ఎమ్మెల్సీ బై పోల్ జరగనుండటంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని ప్రధాన పార్టీలు పని ప్రారంభించాయి. బిఆర్ఎస్‌కు సిట్టింగ్ సీట్ కావడంతో ఎలాగైన తిరిగి దక్కించుకోవాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రంగంలోకి దిగారు. ఖమ్మం వరంగల్ నల్గొండ్ జిల్లా నేతలతో సమావేశమై వ్యూహ రచన చేశారు. ప్రచార, సమన్వయ బాధ్యతలు కీలక నేతలకు అప్పగించి పట్టభద్రులను ప్రసన్నం చేసుకునేందుకు ప్లాన్ వేశారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల ప్రభావం పడకుండా.. లోక్ సభ ఎన్నికల ప్రచార జోష్ తో ఎమ్మెల్సీ ప్రచార వ్యూహాలను కేటీఆర్ ఖరారు చేసినట్లు తెలుస్తోంది. మిగిలిన 12 రోజుల్లో అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా పట్టభద్రులతో సమావేశాల నిర్వహకు స్కెచ్ వేశారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అదే ఊపుతో ఈ ఎమ్మెల్సీ స్థానం కైవసం చేసుకుంటామనే ధీమాతో ఉంది. ఉప ఎన్నికపై సీఎం రేవంత్ రెడ్డి ఆయా జిల్లా నేతలతో రివ్యూ చేశారు. ఎమ్మెల్యేలు పెద్ద ఎత్తున ఎమ్మెల్సీ ఎన్నిక ప్రచారంలో పాల్గొని గెలిపించే బాధ్యతను వారికి అప్పగించారు. అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలుపు కోసం కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. మూడు ఉమ్మడి జిల్లాల్లో మొత్తం 34 ఎమ్మెల్యే స్థానాలు ఉండగా అందులో 33 స్థానాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలున్నారు. ఈ నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో కీలకంగా పనిచేసి ఎమ్మెల్సీ స్థానాన్ని కైవసం చేసుకోవాలని నేతలకు సీఎం రేవంత్ స్పష్టం చేశారు. ప్రచార వ్యూహాలను పక్కాగా అమలు చేసి విజయబావుటా ఎగురవేయాలని కాంగ్రెస్ స్కెచ్ వేసింది.

# యేటా ఫీజులు పెంచుతున్న ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నియమనిబంధనలు గాలికి

**సిద్దిపేట క్రైం :** పిల్లలకు మంచి విద్య అందించి వారి భవిష్యత్ బాగుండాలని తపించే తల్లిదండ్రుల ఆశను కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు సొమ్ముచేసుకుంటున్నాయి. యేటా ఫీజులు పెంచుతూ వారి నడ్డి విరుస్తున్నాయి. సిద్దిపేట జిల్లాలో మొత్తం 257 ప్రైవేట్ పాఠశాలు ఉన్నాయి.వీటిలో 10 వరకు కార్పొరేట్ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో పాఠశాల ఫీజుతో పాటు బుక్స్, ల్యాబ్, లైబ్రరీ, స్పోర్ట్స్ ఫీజులంటూ విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అందినకాడికి దోచుకుంటున్నారు. జిల్లా కేంద్రంలోని ఓ కార్పొరేట్ పాఠశాలలో ఎల్‌కేజీ విద్యార్థికి ఏడాదికి అన్ని ఫీజులు కలిపి రూ.80వేల వరకు వసూలు చేస్తున్నారు. ఓ కార్పొరేట్ పాఠశాల ఒకే పేరుతో నాలుగు బ్రాంచ్‌లను ఏర్పాటు చేసి రూ.లక్షల్లో ఫీజు వసూలు చేస్తున్నది. ఈ ఫీజులు గతేడాది కంటే ఈ ఏడాది మళ్లీ అధికమవ్వనున్నాయి. కొన్ని ప్రైవేట్ పాఠశాలల్లో ప్రైమరీ విద్యార్థులకు రూ.20వేల నుంచి రూ.50వేలు, హైస్కూల్ విద్యార్థులకు రూ.40వేల నుంచి రూ.70వేల వరకు వసూలు చేస్తున్నారు. జిల్లాలోని కొన్ని ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతున్నాయి. ఆర్టీఈ 2009 విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రతి ప్రైవేట్ పాఠశాలలో ఉన్న విద్యార్థుల సంఖ్యలో 25 శాతం మంది పేద విద్యార్థులకు ఉచితంగా విద్యను అందించా లి. ఈ నిబంధనను ఏ ఒక్క పాఠశాలలో కూడా అనుసరించడం లేదు. ఈ విషయంలో సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. ప్రభుత్వ నియమ నిబంధనలకు వ్యతిరేకంగా ప్రైవేట్ పాఠశాలలు వ్యవహరిస్తూ అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. రాష్ట్రంలో ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణకు 2017లో ప్రభుత్వం కమిటీ వేసింది. ఆ కమిటీ 2018లో ప్రైవేట్ పాఠశాలలో ఏటా 10శాతం ఫీజులు పెంచుకోవచ్చంటూ ప్రతిపాదనలు చేసి ప్రభుత్వానికి నివేదిక అందించింది. ప్రభుత్వం కమిటీ సిఫార్సులను అమలు చేయలేదు. తర్వాత 2020 ఏప్రిల్‌లో అధిక ఫీజులు నియంత్రించాలని ప్రభుత్వం జీవో జారీ చేసింది. కానీ ప్రభుత్వ ఉత్తర్వులు అమలు కావడం లేదు. విద్యాహక్కు చట్ట ప్రకారం ప్రైవేట్ పాఠశాలలో అడ్మిషన్ ఫీజు వసూలు చేయకూడదని నిబంధన ఉన్నది. కొన్ని ప్రైవేట్ పాఠశాలల్లో ప్రైమరీ విద్యార్థులకు రూ.20వేల నుంచి రూ.50వేలు, హైస్కూల్ విద్యార్థులకు రూ.40వేల నుంచి రూ.70వేల వరకు వసూలు చేస్తున్నారు.

# తిమ్మాయిపల్లేలో పిడుగు...



తెలంగాణా క్యాపిటల్ న్యూస్ బెజ్జంకి: సిద్ధిపేట జిల్లా బెజ్జంకి మండలంలోని తిమ్మాయిపల్లీ లో గురువారం పిడుగు పడింది. సాయత్రం 4 గంటల ప్రాంతంలో గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. వర్షం రావటంతో తిమ్మాయిపల్లి లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద వున్న హమాలీలు దూరంగా వెల్లారు. అంతలోనే పెండ్యాల శ్రీనివాస్ కు చెందిన వరి చేనులోని గడ్డి కుప్ప మీద పెద్ద శబ్దంతో పిడుగు పడింది. ఆ సమయంలో ఎవరు లేకపోవటంతో ఏలాంటి నష్టం జరగలేదు.

# మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి భవనాన్ని స్వాధీనం చేసుకున్న ఆర్టీసి



హైదరాబాద్: హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం బకాయిలను చెల్లించనందున విష్ణుజిత్ ఇన్ఫ్రా డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ తో చేసుకున్న అద్దె ఒప్పందాన్ని రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిఎస్ ఆర్టీసి) యాజమాన్యం రద్దు చేసుకుంది. అందులో భాగంగా నిజామాబాద్ జిల్లా ఆర్మూరు బస్‌స్టేషన్ సమీపంలోని ఆర్టీసి స్థలంలో ఉన్న జీవన్ రెడ్డి మాల్ అండ్ మల్టీప్లెక్స్ భవనాన్ని గురువారం సాయంత్రం ఆ సంస్థ స్వాధీనం చేసుకుంది. ఆర్టీసికి చెందిన 7,059 చదరపు గజాల భూమిని 33 సంవత్సరాలకు విష్ణుజిత్ ఇన్ఫ్రా డెవలపర్స్ కంపెనీ బిల్ట్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్(బిఓటీ) కింద 01.06.2013న లీజుకు తీసుకుంది. వారి నుంచి 2017లో విష్ణుజిత్ ఇన్ఫ్రా డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీని మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి సతీమణి రజితారెడ్డి టేక్ ఓవర్ చేసుకొని షాపింగ్ మాల్‌కు జీవన్ రెడ్డి మాల్ అండ్ మల్టీపెక్స్‌గా పేరుపెట్టారు. ఒప్పందం ప్రకారం ఆ కంపెనీ సకాలంలో అద్దె చెల్లించలేదు. ఈ నేపథ్యంలోనే ఆర్టీసి కోర్టును ఆశ్రయించింది. ఈ నేపథ్యంలో హైకోర్టు ఆర్టీసికి అనుకూలంగా తీర్పునిచ్చింది. ఈ నేపథ్యంలో కోర్టు ఆదేశాలిచ్చి నెల రోజుల గడువు పూర్తయిన మొత్తం బకాయిలను విష్ణుజిత్ ఇన్ఫ్రా డెవలపర్స్ కంపెనీ చెల్లించలేదు. ఇప్పటివరకు రూ.2.51 కోట్ల అద్దెకు సంబంధించి బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే విష్ణుజిత్ ఇన్ఫ్రా డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు టర్మినేషన్ ఆర్డర్ ఇచ్చి భవనాన్ని టిఎస్ ఆర్టీసి స్వాధీనం చేసుకుంది.

# రైతుల హామీలు నెరవేర్చని అసమర్థ సీఎం రేవంత్ రెడ్డి.. మాజీ మంత్రి సబిత



మహేశ్వరం : రైతులకు ఇచ్చిన ఒక్క హామీ నెరవేర్చని అసమర్థ సీఎం రేవంత్ రెడ్డి అని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. రాష్ట్రవ్యాప్త నిరసనకు అధినేత కేసీఆర్ పిలుపు మేరకు మహేశ్వరం నియోజకవర్గంలోని మహేశ్వరం గేట్ శ్రీశైలం రహదారిపై సబితా ఇంద్రారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ%ౌ% పార్లమెంటు ఎన్నికలు ముగిసిన తెల్లారే వరి ధాన్యానికి క్వింటాల్ కు 500 రూపాయల బోనస్ చెల్లిస్తానని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి.. ఇప్పుడు సన్న వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామనడం రాష్ట్ర రైతాంగాన్ని మరోసారి వంచించడం, మోసం చేయడం, దగా చేయడమేనని విమర్శించారు. రాష్ట్రంలో 90శాతం రైతులు దొడ్డు వడ్లనే పండిస్తారు. ఈ విషయం తెలిసి కూడా రాష్ట్ర ప్రభుత్వం ఇట్లా ఎట్లా ప్రకటిస్తది ? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సన్న వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామనడం ద్వారా తెలంగాణ రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి వంచించిందన్నారు. ఓట్లు డబ్బాలో పడంగనే కాంగ్రెస్ వాళ్లకు రైతుల అవసరం తీరిందన్నారు. అందుకే నాలిక మల్లేసి ఎప్పటి మాదిరిగానే నయవంచనకు పూనుకున్నారన్నారు. ఇదే సన్న వడ్లకు మాత్రమే అనే మాట ఎన్నికలకు ముందు గనుక చెప్పింటే కాంగ్రెస్ పార్టీని రైతులు తుక్కు తుక్కు చేసేవాళ్లన్నారు. ఇప్పటికీ ప్రజలు ఆగ్రహంతోనే ఉన్నారన్నారు. రైతు బంధు, రైతు భరోసా ఇయ్యకుండా రైతాంగాన్ని అన్ని రకాలుగా కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తుందన్నారు. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు రైతుల పక్షాన నిలబడి కొట్లాడాలని పిలుపునిచ్చారు. ఇప్పటికీ కొనుగోలు కేంద్రాల్లో వడ్లను కొనడానికి నిర్లక్ష్యం వహిస్తూ రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం ఏడిపిస్తూ గోస పుచ్చుకుంటున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో భారీగా బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

# అన్ని రకాల ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వాలి



హైదరాబాద్: రాష్ట్రంలో అన్ని రకాల వరిధాన్యానికి ప్రభుత్వం బోనస్ ప్రకటించాలని తెలంగాణ రైతుసంఘం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. కేవలం సన్న వడ్లకు మాత్రమే క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రభుత్వం చెప్పినట్లు ప్రచారం జరుగుతున్నదని . దీంతో రైతాంగంలో గందరగోళ వాతావరణం ఏర్పడిందని రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్‌రావు తెలిపారు. రైతాంగం పండించే అన్ని రకాల వడ్లకు క్వింటాల్‌కు రూ. 500 బోనస్ ఇవ్వాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల మ్యానిఫెస్టోలో వడ్లకు క్వింటాల్‌కు రూ. 500 బోనస్ ఇస్తామని ప్రకటించిందని, ఇప్పుడు కేవలం సన్న వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామనడం విడ్డూరంగా ఉందన్నారు. వడ్లు పండించే రైతులలో 80 శాతం దొడ్డు వడ్లు, 20 శాతం సన్న వడ్లును పండిస్తున్నారని, ఇందులో అత్యధికం సన్న చిన్నకారు రైతులే ఉన్నారని తెలిపారు. రైతాంగానికి నష్టం జరగకుండా వడ్ల పండించిన అందరికి ఒకే రకంగా బోనస్ చెల్లించాలన్నారు. ప్రస్తుతం కొనుగోలు చేస్తున్న యాసంగి పంటలకు కూడా వర్తింప చేయాలన్నారు. రైతాంగం గందరగోళానికి లోనూ కాకుండా ఉండేందుకు ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన విడుదల చేయాలని తెలిపారు. వడ్లు పండించే రైతులందరికి ఒకే రకమైన బోనస్ చెల్లించని పక్షంలో రైతాంగాన్ని కూడగట్టి ఆందోళనా పోరాటాలు నిర్వహిస్తామని సుదర్శన్‌రావు హెచ్చరించారు.




## కుక్కలు బాబోయ్...

# వీధి కుక్కలు

- సిరిసిల్లలో యాబైవేలకు పైగా వీధి కుక్కలు
- ఆరేళ్ల బాలుడు పై దాడి చేసిన వీది కుక్కలు
- రాష్టంలో కుక్క కాటుతో రోజుకు వేలాది మంది ఆసుపత్రుల పాలవుతున్న వైనం

తెలంగాణ క్యాపిటల్ న్యూస్

రాజన్న సిరిసిల్ల : సిరిసిల్ల మున్సిపాలిటీ పరిధిలో వీధి కుక్కల స్వైర విహారం అందర్నీ భయపడుతుంది. సిరిసిల్ల పట్టణం బివై నగర్ లో ఇద్దరు చిన్న పిల్లలపై పిచ్చి కుక్కలు దాడి చేశాయి. వివరాల్లోకి వెళితే ఆద్య 6 సంవత్సరాలు లిమ్స్ 9 సంవత్సరాలు ఇద్దరు చిన్నారులపై విచక్షణ రహితంగా దాడి చేశాయి. చిన్నారులను ఆసుపత్రిలో చేర్పించారని తెలిసింది. గత వారం రోజుల నుండి కుక్కలు ఉన్నాయని ఎన్ని సార్లు పిర్యాదు చేసిన మున్సిపల్ అధికారులు నుండి స్పందన కరువయ్యిందని అంటున్నారు. మున్సిపాలిటీల్లో కోట్ల రూపాయలు వీటిపై లెక్కలు చూపెడుతూ ఆచరణలో మాత్రం శూన్యం చేస్తున్నారు.



**విశ్వాసానికి మారుపేరు సునక రాజు..**

మనుషులకు కుక్కలు విశ్వాసప్రాణులుగా ఉంటూ వస్తున్నాయి. పేదవాడి నుంచి కోట్ల సంపద కలిగిన వారి గృహాల్లో పెంపుడు కుక్కలకు పెద్దపీట లభిస్తుంది. నేడు పెట్స్ షోలా పేరుతో కోట్ల రూపాయల విలువ చేసే కుక్కల షోల ప్రస్థానం కొనసాగిస్తున్నారు. వీటి సంగతి ఎలా ఉన్నా వీధి కుక్కల సైరా విహారం అందరికీ ఇబ్బంది పెడుతుంది .వీధిలో తిరిగే కుక్కలు చిన్నపిల్లలు, పెద్దలు అంటూ తేడా లేకుండా కండలు పీక్కు తింటున్న పట్టించుకోని పరిస్థితులు హైదరాబాదులో కనిపిస్తున్నాయి. విశ్వ నగరంలో ఎంతో అభివృద్ధి సాధించామని చెప్పుకుంటున్న పాలకులు వీధి కుక్కల దాడుల చూస్తే ఇదేమి దరిద్రం రా బాబు అంటూ తడుముకోవాల్సిన పరిస్థితులు మహానగరంలో నెలకొన్నాయి. . వీధి కుక్కలు మనుషులను కలిసి కండలు పీకే సాయి నుంచి నేడు చంపేస్తాయికి ఎదుగుతూ వచ్చాయి .గతంలో కూడా పసికందులను ఈడ్చుకెళ్లిన ఘటనలు కళ్ళ ముందు కనిపిస్తున్నాయి .2023 సంవత్సరంలో హైదరాబాద్ మహానగరం లో పట్టపగలు నడి వీధిలో నాలుగేళ్ల బాలుడు వెంటపడి హతమార్చిన ఘటన చూసిన వారి హృదయాలు చెల్లించిపోయాయి. పిల్లవాడిని కన్న తల్లిదండ్రులు గర్భశోకాన్ని ఎవరు ఎన్నటికీ తీర్చలేని దుస్థితి గా మారింది.

ఇలాంటి పరిస్థితి ఎవరికీ రావద్దని ఇకనైనా చర్యలు చేపట్టాలని మహా నగర వాసులు అప్పట్లో కోరుకున్నారు. అప్పటి మేయర్ బేకతారు చేసి చర్యలు తీసుకోవడం లో విఫలం అయ్యారు. కానీ సిరిసిల్ల లో రెప్పపాటు దూరంలో చిన్నారులు బతికి బట్ట కట్టారు. అక్కడ ఉన్న వ్యక్తులు కుక్కలని బెదిరించడం తో చిన్నారులను వదిలాయని లేక పోతే చిన్నారుల ప్రాణాలు గాలిలో కలిసేవని అంటున్నారు.అక్కడి స్థానికులు.

**వీధి కుక్కల కాకి లెక్కలు..**

- కుక్కలకు యాంటీ రాబిస్ వ్యాక్సిన్ ఇవ్వాల్సి ఉంటుంది. ప్రజలను కుక్కలు కరిచిన కూడా ఆంటీరాబిస్ వ్యాధి రాకుండా ఉంటుంది. ఇలాంటి వ్యాక్సినేషన్ కుక్కలకు వేస్తున్నామని కాకి లెక్కలు చెబుతున్నారు అధికారులు. కానీ తీసుకువచ్చిన కుక్కలకు ఆపరేషన్ అనంతరం మంచి భోజనం పెడుతున్నట్లు తప్పుడు లెక్కలు చూపించి లక్షల సొమ్మును బొక్కేస్తున్నారు. ఇలా... ఒకటేమిటి ఎక్కడ చూసినా అవినీతి అక్రమాలే వెలుగులోకి వచ్చే పరిస్థితులు కనిపిస్తున్నాయి. వీధి కుక్కలను నియంత్రంచే దానికి పలు సంస్థలకు మున్సిపాలిటీ పాలకవర్గం కుదుర్చుకున్నాయి. ఈ కాంట్రాక్టులో సంవత్సరానికి రూపాయలు కోట్ల ఖర్చు చేస్తున్న రాష్టం లోని మున్సిపాలిటీల్లో కుక్కల పెరుగుదల తగ్గడం కంటే రోజురోజుకు రెట్టింపు అవుతూ వస్తుంది. ఈ విషయాన్ని అధికార యంత్రాంగం తమకు వస్తున్న మామూళ్లలో చూసి చూడనట్లు వ్యవహరిస్తూ ఉండడంతో కుక్కల పెరుగుదల ఆకాశాన్ని అంటే పరిస్థితులు చోటు చేసుకున్నాయి. చేతులు కాలాక ఆకులు పట్టుకున్న పట్టుకుంటున్నట్లుగా మంత్రులు ప్రజాప్రతినిధులు, అధికారులు వీధి కుక్కల నియంత్రణకు ప్రత్యేకంగా బృందాలను ఏర్పాటు చేసి అన్నింటిని పట్టుకుంటామని చెప్తూనే ఉంటారు. ఏది ఏమైనా ఇలాంటి వీధి కుక్కల కాటుకు బలవుతున్న వారికి రక్షణ కల్పించాల్సిన అవసరం ప్రభుత్వం పైన, మున్సిపాలిటీలపై ఎంతైనా ఉంది.

**పంచాయతీ వరకు**

సిరిసిల్ల పట్టణం మున్సిపాలిటీ పరిధిలో చిన్నారులపై కుక్కల దాడిలో వెలుగు చూసిన నిజాలు ఎన్నో ఉంటే ఇలాంటి పరిస్థితులు ప్రతి గ్రామపంచాయతీలోనూ మున్సిపాలిటీలో నగర పంచాయతీలోనూ పురపాలక సంఘాల్లో అనేకంగా ఉన్నాయి. వీటిపై కూడా ఇదే సమయంలో దృష్టి సాధించాల్సిన అవసరం ఉంది. నాటి కాలంలో కుక్కలను పెంచుకుంటే దొంగలు వచ్చినప్పుడు మొరుగుతాయని విషయానికి వాటిని పోషించే పరిస్థితి ఉండేది .కానీ ఇవాళ దొంగలకంటే ఎక్కువగా కుక్కలు మనుషులపై దాడులు నిర్వహించడం సోషనీయంగా మారింది. ఇలాంటి పరిస్థితులను అందరూ పరిగణలోకి తీసుకొని గ్రామ పంచాయతీల నుంచి మున్సిపాలిటీల వరకు కుక్కల నియంత్రణ వాటి స్వైర వ్యవహారము, దాడులను అరికట్టాల్సిన అవసరం ఉంది. దీనికోసం ప్రభుత్వం ప్రత్యేకంగా ఒక నిర్వహణ కమిటీని ఏర్పాటు చేయాల్సి కూడా ఉంది. కరోనా రోగం కంటే భయంకరమైనటువంటి యాంటీ రాబిస్ వ్యాధిని వ్యాపించకుండా అరికట్టడానికి చర్యలు తీసుకోవాల్సిన సమయం ఇదే.

# బాధిత కుటుంబానికి రసమయి పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న రసమయి బాలకిషన్

తెలంగాణ క్యాపిటల్ న్యూస్, గన్నేరువరం: గన్నేరువరం మండల పరిధిలోని గునుకుల కొండాపూర్ గ్రామంలో ఇటీవల దొమ్మటి శంకర్ తండ్రి ఆశయ్య మరణించగా గురువారం మానకొండూరు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ భాదిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు ఆయన వెంట ఎంపీటీసీ గూడెల్లి ఆంజనేయులు, న్యాలపట్ల శంకర్ గౌడ్, రాజు గౌడ్, మహిపాల్ రెడ్డి తదితరులు ఉన్నారు.